# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...









సంపుటి : 2 | సంచిక : 313 | శుక్రవారం 5 జులై 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# తెలంగాణ నిఘా విభాగాలకు నిధులు కేటాయించండి



- అమిత్ షాను కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- డగ్స్, సైబర్ నేరాల నియంత్రణతో పాటు అరికట్టడానికి కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల కొనుగోలు కోసం టీజీ న్యాబ్‌కు రూ.88 కోట్లు, టీజీ సీఎస్‌బీకి రూ.90 కోట్లు కేటాయించాలి
- ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఐపీఎస్ క్యాడర్ సమీక్ష చేయడం తప్పనిసరి
- తెలంగాణకు సంబంధించి 2016లో మొదటి సారి సమీక్ష నిర్వహించారు
- నాటి నుంచి సమీక్ష చేయనుందున వెంటనే సమీక్ష చేయాలి
- రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 61 ఐపీఎస్ పోస్టులు కేటాయించారు
- రాష్ట్ర అవసరాలకు ఐపీఎస్‌లు సరిపోనందున, తెలంగాణకు అదనంగా మరో 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజప్తి
- పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలి

**న్యూ ఢిల్లీ:**

రాష్ట్ర స్థాయి అత్యున్నత నిఘా విభాగాలైన తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) ఆధునీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర హెూం శాఖ మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కలిశారు. సుమారు గంటపాటు కొనసాగిన భేటీలో వివిధ అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. భేటీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణతో పాటు అరికట్టడానికి కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల కొనుగోలు కోసం టీజీ న్యాబ్‌కు రూ. 88 కోట్లు, టీజీ సీఎస్‌బీకి రూ. 90 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి కోరారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఐపీఎస్ క్యాడర్ సమీక్ష చేయడం తప్పనిసరని, తెలంగాణకు సంబంధించి 2016లో మొదటి సారి సమీక్ష నిర్వహించారని, నాటి నుంచి సమీక్ష చేయనుందున వెంటనే సమీక్ష చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 61 ఐపీఎస్ పోస్టులు కేటాయించారని, రాష్ట్ర అవసరాలకు ఐపీఎస్‌లు సరిపోనందున, తెలంగాణకు అదనంగా మరో 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో సెక్యూరిటీ ఫోర్స్ క్యాంపులు ఏర్పాటు చేసిన విషయాన్ని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి - మిగతా3లో




# మూతబడిన పాఠశాలలపై దృష్టి

- విద్యావ్యవస్థను గాడిలో పెట్టామని గోడలకు రంగులు వేసి కరపత్రాలు ముద్రించుకుని మురిపోయారు నాటి బీఆర్ఎస్ నేతలు.
- తెలంగాణలో 28 వేల పైచిలుకు పాఠశాలలు ఉండగా అందులో ఇప్పటికీ సగానికిపైగా పాఠశాలలు మూసి వేయబడ్డాయి
- కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కార్ తక్షణ చర్యలు తీసుకోకపోతే కొత్తగా మరికొన్ని మూతబడే ప్రమాదం

హైదరాబాద్

పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ తీవ్ర అవస్థలపాలయింది. తెలంగాణ వస్తే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని ప్రసంగాలతో ఊదరకొట్టిన నాటి బీఆర్ ఎస్ నాయకులు బాల్యం నిర్వీర్యం అయిపోతుంటే చోద్యం చూశారే తప్ప రాష్ట్ర విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు. - మిగతా3లో

# ప్రభుత్వ తీరు దుర్మార్గం



- రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు..
- కాంగ్రెస్ సర్కార్‌కు చీమకుట్టినట్లైనా లేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించకపోవడం బాధాకరం

హైదరాబాద్

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు నిత్యకృత్యం అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఈ మేరకు హరీశ్‌రావు ట్వీట్ చేశారు. ఖమ్మం జిల్లాలో మొన్న ఒక రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయాడు. తన సమస్యకు పరిష్కారం చూపడం లేదనే ఆవేదనతో నిన్నసీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే మరో రైతు - మిగతా3లో

తెలంగాణ ప్రజల నిర్ణయం..

# దేశ రైతాంగాన్ని నిరూత్సాహపరిచింది

- విద్యుత్, సాగునీరు, వ్యవసాయ తదితర రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణ దేశ చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా కొనసాగింది
- వ్యవసాయ ప్రగతిని చూసి మహారాష్ట్రవంటి పక్క రాష్ట్రాల ప్రజలు తమకూ కేసీఆర్ పాలన కావాలని కోరుకున్నారు
- ఎన్నికల ఫలితాలతో మహారాష్ట్ర ప్రజలు ఆవేదన చెందారు..
- అధికారం పోయిందని బాధపడటం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదు
- ప్రజాస్వామ్యంలో అధికారం లేదా ప్రతిపక్ష పాత్ర శాశ్వతం కాదన్న కేసీఆర్
- మనకు ప్రజాతీర్పే శిరోధార్యమని... వారు ఏ పాత్రను అప్పగిస్తే దానిని నిర్వర్తించాలని వ్యాఖ్య




హైదరాబాద్

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణ అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా పాలనను అందించిందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. విద్యుత్, సాగునీరు, వ్యవసాయ తదితర రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణ దేశ చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా కొనసాగిందని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ ప్రగతిని చూసి మహారాష్ట్రవంటి పక్క రాష్ట్రాల ప్రజలు తమకూ కేసీఆర్ పాలన కావాలని కోరుకున్నారని తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, నర్సాపూర్, - మిగతా3లో



# మోదీజీ.. అంతరిక్ష యాత్రకు ముందు మణిపూర్ యాత్ర చేపట్టండి

- అంతరిక్షానికి వెళ్లే ముందు మన ప్రధాని మణిపూర్ వెళ్లాలని ఎక్స్ వేదికగా ఎద్దేవా
- మణిపూర్ అంశంపై ప్రధాని మాట్లాడాలని పార్లమెంట్‌లో కూడా విపక్షాలు పట్టుబట్టాయి.
- మణిపూర్‌లో శాంతి నెలకొనేందుకు కేంద్ర రాష్ర ప్రభుత్వాలు అన్ని వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నాయి



# భూమ్మీద మనుషులుండే మారుమూల దీవి

- నాసా షేర్ చేసిన ఫొటో!
- అట్లాంటిక్ మహా సముద్రం మధ్యలో ఉన్న దీవి
- 300 మంది లోపే జనాభా.. అంతా బ్రిటన్ సంతతి వారే..
- ఈ దీవికి దగ్గరిలోని కేప్ టౌన్ కు దూరమే ఏకంగా 2,787 కిలోమీటర్లు.

# కన్ఫ్యూజన్‌లో కాంగ్రెస్

- మంత్రివర్గం విస్తరణ వాయిదా..!
- కేవలం రేవంత్‌తో పాటు 11మంది మంత్రులతో కేబినెట్ ఏర్పడింది.
- తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు సద్దుమణిగేట్లు కనిపించడం లేదు
- అధికారంలో ఉన్న హస్తం పార్టీ నేతలు ఐక్యంగా ఉన్నట్లు పైకి కనిపిస్తున్నా..
- లోలోపల మాత్రం నేతల మధ్య విబేధాలు కొనసాగుతున్నాయనే చర్చ



హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైంది. ఇంకా పూర్తిస్థాయిలో మంత్రివర్గం కొలువుదీరలేదు. కేవలం రేవంత్‌తో పాటు 11మంది మంత్రులతో కేబినెట్ ఏర్పడింది. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటుచేయలేదు. ఎన్నికల తర్వాత కేబినెట్‌ను విస్తరించాలని కాంగ్రెస్ హైకమాండ్ ఆలోచించింది. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాయి. దీంతో కొత్త పీసీసీ చీఫ్ నియామకంతో పాటు మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ ఫోకస్ పెట్టింది. దీనిలో భాగంగా రేవంత్‌ను ఢిల్లీకి పిలిచి పలుమార్లు చర్చించింది. పీసీసీ చీఫ్‌తో పాటు.. మంత్రివర్గంలో ఎవరిని తీసుకోవాలనేదానిపై రేవంత్ కొన్ని పేర్లను అధిష్ఠానానికి ప్రతిపాదించారు. అదే సమయంలో పార్టీలో కొందరు సీనియర్ నేతలు, మంత్రులు.. రేవంత్ ప్రతిపాదించిన పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఏకాభిప్రాయం రాకపోవడంతో పీసీసీ చీఫ్ ఎంపికతో పాటు.. మంత్రివర్గ విస్తరణను వాయిదావేసింది. అంతర్గత విబేధాలు సమసిపోయిన తర్వాత మంత్రివర్గాన్ని విస్తరించాలని.. - మిగతా3లో

# జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్..



జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సోరెన్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అంతకు ముందు ఆయనను కూటమి నేతలు లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నుకున్నారు. చంపై సోరెన్ బుధవారం సీఎం పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌ను కలిసి ఆయనకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత హేమంత్ సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించారు. సోరెన్ సీఎంగా ప్రమాణం ప్రమాణం చేయడం ఇది మూడోసారి. కేవలం సోరెన్ మాత్రమే ప్రమాణస్వీకారం చేయగా.. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగనున్నది.

ఆ తర్వాత మంత్రులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. సీఎం పదవి నుంచి వైదొలిగిన చంపై సోరెన్ ఇకపై కోఆర్డినేషన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించారనున్నారు. నిన్న జరిగిన జార్ఖండ్ ముక్తి మోర్చా సమావేశంలో శాసనసభాపక్ష నేతగా హేమంత్ సోరెన్‌ను నియమించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ జార్ఖండ్ ఇన్‌చార్జి గులాం అహ్మద్ మీర్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్, హేమంత్ సోరెన్ సోదరుడు బసంత్ సోరెట్, భార్య కల్పనా సోరెన్ సమావేశానికి హాజరయ్యారు. భూ కుంభకోణం కేసులో దాదాపు ఐదునెలల తర్వాత మాజీ సీఎం హేమంత్ సోరెన్ జూన్ 28న జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈడీ కేసులో ఆయన జనవరి 31న అరెస్ట్ కాగా.. హేమంత్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

కాగా, హేమంత్ సోరెన్ జైల్లో ఉన్న సమయంలో చంపయీ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. హేమంత్ జైలు నుంచి విడుదలైన నేపథ్యంలో, అధికార జేఎంఎం ఎమ్మెల్యేలు చంపయీ సోరెన్ నివాసంలో సమావేశమయ్యారు. హేమంత్ ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. చంపయీ సోరెన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా, హేమంత్ సోరెన్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ రాధాకృష్ణన్ ఆహ్వానించారు. వాస్తవానికి జులై 7న ప్రమాణ స్వీకారం చేయాలని హేమంత్ భావించారు. అనూహ్య రీతిలో ఈ మధ్యాహ్నమే ప్రమాణ స్వీకారం చేశారు.

## మందు పార్టీ తర్వాత మిగిలిన మద్యం బాటిల్స్ తీసుకెళ్లిన వ్యక్తి.. హత్య చేసిన ఫ్రెండ్



పనాజీ: మందు పార్టీ తర్వాత మిగిలిన మద్యం బాటిల్స్‌ను ఒక వ్యక్తి తీసుకెళ్లాడు. దీనిపై ఆగ్రహించిన స్నేహితుడు అతడ్ని హత్య చేశాడు. హత్య కేసుపై దర్యాప్తు జరిపిన పోలీసులు చివరకు ఫ్రెండ్ అయిన నిందితుడ్ని అరెస్ట్ చేశారు. గోవాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం అర్ధరాత్రి కోర్టాలిమ్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న స్థలంలో ఒక వ్యక్తి హత్యకు గురైనట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతుడ్ని 32 ఏళ్ల లియోనెల్ లోబోగా గుర్తించారు. హత్య కేసుపై దర్యాప్తు చేశారు. చివరకు అతడి స్నేహితుడైన 34 ఏళ్ల అలెక్స్ కొటిన్హోను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, నిందితుడ్ని పోలీసులు ప్రశ్నించగా ఫ్రెండ్‌ను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. గత వారం మందు పార్టీ తర్వాత మిగిలిన మద్యం బాటిల్స్‌ను స్నేహితుడు తీసుకెళ్లడంతో ఆగ్రహానికి గురైనట్లు తెలిపాడు. మంగళవారం రాత్రి నిర్మాణ స్థలంలో నిద్రిస్తున్న లోబో తలపై సిమెంట్ దిమ్మతో కొట్టి హత్య చేసినట్లు పోలీసులకు చెప్పాడు. అలెక్స్ దుస్తులపై మృతుడి రక్తం మరకలు ఉన్నట్లు ఫోరెన్సిక్ పరీక్ష ద్వారా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ కోడ్ భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## నాలుగేళ్ల బాలికపై కాల్పులు.. బుల్లెట్ గాయాలతో మృతి



**పాట్నా:** తండ్రి కోసం ఇంటి నుంచి బయటకు వచ్చిన నాలుగేళ్ల బాలికపై గుర్తు తెలియని వ్యక్తులు గన్‌తో కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆ చిన్నారి రక్తం ముడుగుల్లో పడి మరణించింది. బీహార్ రాజధాని పాట్నాలో ఈ సంఘటన జరిగింది. రూపస్‌పూర్ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్న హరి ఓం కుమార్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతడు ఇంటికి తిరిగి వచ్చాడు. తండ్రి రాకను గమనించిన నాలుగేళ్ల కూతురు ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఇంట్లోకి వెళ్లిన కుమార్ బైక్‌ను పార్క్ చేశాడు. అతడు తెచ్చిన సరుకులను భార్య ఇంట్లోకి తీసుకెళ్లింది. కాగా, ఇంటి బయట ఉన్న నాలుగేళ్ల పాపపై గుర్తు తెలియని వ్యక్తులు గన్‌తో కాల్పులు జరిపారు. కాల్పుల శబ్ధం విన్న చిన్నారి తల్లిదండ్రులు వెంటనే ఇంటి బయటకు వచ్చారు. తమ కుమార్తె రక్తం మడుగుల్లో పడి ఉండటం చూసి షాక్ అయ్యారు. వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆ బాలిక అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పుల్లో మరణించిన బాలిక మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన తర్వాత తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారిపై కాల్పులు జరిపిన నిందితులను గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

## జార్ఖండ్‌లో ఆపరేషన్ లోటస్ విఫలం : ఆప్ నేత





జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ మరోసారి పగ్గాలు చేపడుతున్న క్రమంలో బీజేపీపై ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ విమర్శలు గుప్పించారు. జార?ండ్‌లో బీజేపీ ఆపరేషన్ ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. జార?ండ్‌లో బీజేపీ వ్యూహం పూర్తిగా పెయిలైందని, హేమంత్ సోరెన్‌ను జైలుకు పంపి ఆయన వదిన సాయంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చవచ్చని, బీజేపీ అక్కడ పాగా వేయవచ్చని కాషాయ పార్టీ ఆలోచించిందని అన్నారు. అయితే హేమంత్ సోరెన్ తన పార్టీతో పాటు ప్రభుత్వాన్ని కాపాడుకుని బీజేపీకి షాక్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. జార్ఖండ్ ప్రజలు హేమంత్ సోరెన్‌ను అనుకూలంగా తీర్పు ఇచ్చారని, ప్రజా తీర్పును పొందిన హేమంత్ సోరెన్ తిరిగి జార్ఖండ్ సీఎం అవుతుంటే బీజేపీ ఎందుకు నిస్తేజానికి గురువుతున్నదని ఆయన ప్రశ్నించారు. మరోవైపు జార్ఖండ్ 13వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ఈరోజే బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది. కాగా, మనీలాండరింగ్ కేసులో అరెస్టైన హేమంత్ సోరెన్.. ఐదు నెలల తర్వాత జూన్ 28న బెయిల్‌పై బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం జేఎంఎం నేతృత్వంలోని కూటమి ఎమ్మెల్యేలు సమావేశమై హేమంత్‌ను శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడం లాంఛనం అయ్యింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాల్సిందిగా హేమంత్ సోరేన్ ఇవాళ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కోరారు. గవర్నర్ కూడా ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. దీంతో జార?ండ్ 13వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరేన్ ఇవాళ సాయంత్రం బాధ్యతలు చేపట్టనున్నారు.

## మోదీజీ..అంతరిక్ష యాత్రకు ముందు మణిపూర్ యాత్ర చేపట్టండి



భారత్ తొలి మానవ సహిత అంతరిక్ష యాత్రలో ప్రధాని నరేంద్ర మోదీ అంతరిక్షానికి వెళతారని ఇస్రో చీఫ్ ఎస్.సోమ్‌నాథ్ పేర్కొన్నట్టు వచ్చిన వార్తలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ప్రస్తావించారు. అంతరిక్షానికి వెళ్లే ముందు మన ప్రధాని మణిపూర్ వెళ్లాలని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. 2025లో చేపట్టే గగన్‌యాన్ మిషన్‌ను ప్రస్తావిస్తూ ఇస్రో చీఫ్ ఎస్. సోమ్‌నాథ్ వెల్లడించిన వివరాలను ఉటంకిస్తూ జైరాం రమేష్ ప్రధాని మోదీపై సోషల్ మీడియా పోస్ట్‌లో విమర్శలు గుప్పించారు. కాగా మే,2023 నుంచి రెండు వర్గాల మధ్య ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ భగ్గుమంటుండగా ఈ ఘటనలపై విపక్ష ఎంపీల నుంచి మోదీ సర్కార్ విమర్శలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. మణిపూర్ అంశంపై ప్రధాని మాట్లాడాలని పార్లమెంట్‌లో కూడా విపక్షాలు పట్టుబట్టాయి. ఇక మణిపూర్‌లో సాధారణ పరిస్థితి నెలకొనేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతున్నదని ప్రధాని మోదీ బుధవారం రాజ్యసభలో మాట్లాడుతూ స్పష్టం చేశారు. మణిపూర్ అల్లర్లకు సంబంధించి 11000 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, 500 మందికి పైగా అరెస్ట్ చేశారని తెలిపారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. మణిపూర్‌లో శాంతి నెలకొనేందుకు కేంద్ర రాష్ర ప్రభుత్వాలు అన్ని వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నాయని వివరించారు. ఇవాళ రాష్ట్రంలో స్కూళ్లు, కాలేజ్‌లు, కార్యాలయాలు, ఇతర సంస్థలు తెరుచుకున్నాయని తెలిపారు

## భూమ్మీద మనుషులుండే మారుమూల దీవి



కొందరు ఎక్కడో ఏ అడవిలోనో, ఎడారిలోనో చిక్కుకుపోతుంటారు. చుట్టూ మనుషులు కనబడక ఆందోళన పడుతుంటారు. మరి ఎక్కడైనా సుదూరంగా ఒకేచోట ఉండిపోయి.. మరో ఊరికి వెళ్లేందుకు వేల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తే ఎలా ఉంటుంది? అలాంటి ఓ ప్రాంతమే 'ట్రిస్టాన్ ద కున్హా'. ప్రపంచంలో మనుషులు నివసించే ప్రాంతాల్లో అత్యంత దూరంగా ఉన్న దీవి ఇదే.

అట్లాంటిక్ మహా సముద్రంలో.. అట్లాంటిక్ మహా సముద్రంలోని ట్రిస్టాన్ దీవి (కుడి వైపు పైన ఉన్నది) నాసా చిత్రం అటు దక్షిణ అమెరికా ఖండానికి, ఇటు ఆఫ్రికా ఖండానికి దాదాపు మధ్యలో ఉండే దీవి 'ట్రిస్టాన్ ద కున్హా'. ఇది బ్రిటన్ దేశం అధీనంలో ఉంది. ఇక్కడున్న ఒకే ఒక్క టౌన్ పేరు 'ఎడిన్ బర్గ్ ఆఫ్ సెవెన్ సీస్'. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ల్యాండ్‌శాట్ ఉపగ్రహం ఇటీవల ఈ దీవిని ఫొటో తీసింది. నాసా తమ 'నాసాఎర్త్' పేరిట ఉన్న ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో ఈ ఫొటోను పోస్ట్ చేసింది.

**మంచు, పచ్చదనం మధ్య..**

207 చదరపు కిలోమీటర్ల వైశాల్యమున్న 'ట్రిస్టాన్ ద కున్హా' దీవిలో చాలా భాగం పెద్ద పర్వతమే. దాని శిఖరం కూడా మంచుతో కప్పి ఉంటుంది. మిగతా దీవి అంతా దట్టమైన అడవులతో పచ్చదనం నిండి ఉంటుంది. ఇక్కడ జనాభా 300 మంది కంటే తక్కువే. అంతా బ్రిటన్ సంతతి వారే నివసిస్తూ ఉంటారు. దీనికి దగ్గరగా కొన్ని దీవులున్నా.. అవేవీ మనుషులు నివసిస్తున్న ప్రాంతాలు కాదు. మిగతా ప్రపంచంతో కలవాలంటే వేల కిలోమీటర్లు సముద్రంలో ప్రయాణం చేయాల్సిందే. ట్రిస్టాన్ దీవికి మనుషులు నివసించే దగ్గరి ప్రాంతం దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ నగరం. దాని దూరం కూడా ఏకంగా 2,787 కిలోమీటర్లు. అందుకే ప్రపంచంలో మనుషులు నివాసం ఉన్న అత్యంత మారుమూల ప్రాంతంగా ట్రిస్టాన్ ను చెబుతారు.

## తొక్కిసలాట తర్వాత గ్రామాన్ని వీడిన భోలే బాబా కాన్వాయ్

లక్నో: హత్రాస్‌లో తొక్కిసలాట తర్వాత భోలే బాబా కాన్వాయ్ ఆ గ్రామాన్ని వీడింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్ హత్రాస్ జిల్లాలోని రాతి భాన్‌పూర్ గ్రామంలో మంగళవారం సత్సంగం జరిగింది. బాబా నారాయణ్ హరి అలియాస్ సాకర్ విశ్వ హరి 'భోలే బాబా' బోధనలు వినేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అయితే సత్సంగం ముగిసిన తర్వాత 'భోలే బాబా' వెళ్తుండగా ఆయన పాద ధూళిని తాకేందుకు భక్తులు ఎగబడ్డారు. ఈ నేపథ్యంలో తొక్కిసలాట జరుగడంటంతో 123 మంది భక్తులు మరణించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే కాగా చిన్న పిల్లలు కూడా చనిపోయారు. కాగా, ఈ తొక్కిసలాట తర్వాత భోలే బాబా కాన్వాయ్ ఆ గ్రామాన్ని వీడింది. పలువురు వాలంటీర్లు రోడ్డుకు ఇరువైపులా ఉన్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు ఈ తొక్కిసలాటకు సంబంధించి గురువారం ఆరుగురు సేవకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు మహిళా సేవకులు కూడా ఉన్నారు. సత్సంగం నిర్వహకుడైన ప్రధాన నిందితుడు ప్రకాష్ మధుకర్ అరెస్ట్ కోసం లక్ష రివార్డును పోలీసులు ప్రకటించారు.

## హేమంత్ సోరెన్ నేతృత్వంలో నెంబర్ వన్ రాష్ట్రంగా జార?ండ్ : మహువ మాఝీ




జార?ండ్ సీఎంగా జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ మళ్లీ ప్రమాణ స్వీకారం చేయడం సంతోషకరమని జేఎంఎం ఎంపీ మహువ మాఝీ అన్నారు. జేఎంఎం పార్టీ కాదని, ఓ కుటుంబమని, ప్రజల కోసం జేఎంఎం కుటుంబసభ్యులు కలిసికట్టుగా ప్రభుత్వాన్ని నడిపిస్తారని ఆమె పేర్కొన్నారు. హేమంత్ సోరెన్ రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టడంతో రాష్ట్రం, ప్రజా ప్రయోజనాల కోసం ఆయన పాటుపడతారని చెప్పారు. జార?ండ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపాలనే హేమంత్ ఆకాంక్ష ఇప్పుడు నెరవేరనుందని ఆమె పేర్కొన్నారు. ఇక జార?ండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సోరెన్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అంతకు ముందు ఆయనను కూటమి నేతలు లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నుకున్నారు. చంపై సోరెన్ బుధవారం సీఎం పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌ను కలిసి ఆయనకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత హేమంత్ సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించారు. సోరెన్ సీఎంగా ప్రమాణం ప్రమాణం చేయడం ఇది మూడోసారి. కేవలం సోరెన్ మాత్రమే ప్రమాణస్వీకారం చేయగా.. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగనున్నది. సీఎం పదవి నుంచి వైదొలిగిన చంపై సోరెన్ ఇకపై కోఆర్డినేషన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించారనున్నారు. నిన్న జరిగిన జార?ండ్ ముక్తి మోర్చా సమావేశంలో శాసనసభాపక్ష నేతగా హేమంత్ సోరెన్‌ను నియమించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ జార?ండ్ ఇన్‌చార్జి గులాం అహ్మద్ మీర్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్, హేమంత్ సోరెన్ సోదరుడు బసంత్ సోరెన్, భార్య కల్పనా సోరెన్ సమావేశానికి హాజరయ్యారు.

## ప్రియురాలిపై కాల్పులు జరిపి కాల్చుకున్న వ్యక్తి.. ఆమె బతకగా, అతడు మృతి




**కోల్‌కతా:** ఒక వ్యక్తి తన ప్రియురాలిపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత తనను తాను గన్‌తో కాల్చుకున్నాడు. ప్రియురాలు బతికిపోగా, ఆ వ్యక్తి మరణించాడు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని బడ్జ్ బడ్జ్‌కు చెందిన రాకేష్ కుమార్ షా, నిక్కు కుమారి దూబే మధ్య ఏడేళ్లుగా పరిచయం ఉంది. బుధవారం కోల్‌కతాలోని లేక్ గార్డెన్ అతిథి గృహంలో వీరిద్దరూ బస చేశారు. సాయంత్రం 4.30 గంటలకు వారి గదిలో కాల్పుల శబ్దం వినిపించింది. నిక్కు పరుగున బయటకు వచ్చి రిసెప్షన్ వద్దకు వెళ్లింది. రాకేష్ తనపై కాల్పులు జరిపాడని చెప్పింది. కాగా, ఇంతలో ఆ రూమ్ నుంచి మరోసారి కాల్పుల శబ్దం వినిపించింది. దీంతో సిబ్బంది లోనికి వెళ్లి చూడగా రాకేష్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. బుల్లెట్ గాయమైన నిక్కు కుమారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆమె పొత్తికడుపు, తొడ భాగంలో కాల్పుల గాయాలున్నట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాకేష్ కుమార్, నిక్కు కుమారి సుమారు ఏడేళ్లుగా కలిసి ఉన్నట్లు తెలుసుకున్నారు. అయితే విడిపోదామని నిక్కు అనడంతో ఆగ్రహించిన రాకేష్ ఆమెను చంపాలనుకున్నాడని పోలీసులు తెలిపారు. నిక్కుపై కాల్పులు జరిపిన అతడు తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బ్రిడ్జి దాటాలంటే భయమేస్తోంది.. బీహార్ బీజేపీ నేత ఆందోళన



పాట్నా: బీహార్‌లో వరుసగా వంతెనలు కూలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలో ఉన్న బీజేపీ నేత దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి దాటాలంటే భయమేస్తోందని అన్నారు. వంతెనలు కూలడంపై సీరియస్‌గా దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేశారు. బీహార్‌లో గత 15 రోజుల్లో పది వంతెనలు కూలిపోయాయి. దీంతో సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కాగా, బీహార్‌లో వరుసగా వంతెనలు కూలడంపై ఆ రాష్ట్ర ప్రజలు, ప్రతిపక్ష పార్టీలతో పాటు బీజేపీ నేత డాక్టర్ నిఖిల్ ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. 'బీహార్‌లోని ఏదైనా ఫ్లైఓవర్ లేదా బ్రిడ్జి దాటాలంటే భయంగా ఉంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. పది రోజుల్లో ఆరుపైగా వంతెనలు కూలిపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'సీరియస్‌గా దర్యాప్తు, ఆడిటింగ్ అవసరం. నిర్మాణ సంస్థలను బాధ్యులుగా చేయాలి. వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. ఇంజినీర్లపై తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలి' అని ఎక్స్ పోస్ట్‌లో డిమాండ్ చేశారు. మరోవైపు మాజీ జర్నలిస్టు అయిన డాక్టర్ నిఖిల్ ఆనంద్ 2015లో బీజేపీలో చేరారు. బీహార్‌లో పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేసిన ఆయన ఇప్పుడు బీజేపీ ఓబీసీ మోర్చాలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

## వాంఖెడే స్టేడియంలో టీమిండియాకు సన్మానం...



ఐసీసీ టీ20 వరల్డ్ కప్-2024 విజేత టీమిండియా ఇవాళ స్వదేశం చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ సాయంత్రం వరల్డ్ కప్ నెగ్గిన టీమిండియా ఆటగాళ్లకు ముంబయిలోని వాంఖెడే స్టేడియంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటగాళ్లకు బీసీసీఐ రూ.125 కోట్ల భారీ నజరానా అందించనుంది. కాగా, తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు వచ్చిన జనంతో ముంబయి మెరైన్ డ్రైవ్ ప్రాంతం క్రిక్కిరిసిపోయింది. అటు అరేబియా సముద్రం, ఇటు జనసముద్రం అన్నట్టుగా ఆ ప్రాంతం అంతా క్రికెట్ అభిమానులతో నిండిపోయింది. మెరైన్ డ్రైవ్ నుంచి ఆటగాళ్లు ప్రత్యేక ఓపెన్ టాప్ బస్సులో వాంఖెడే స్టేడియం వరకు ఊరేగింపుగా వెళ్లనున్నారు. అటు, వాంఖెడే స్టేడియంలోనూ అభిమానులు పోటెత్తారు.

# తెలంగాణ నిఘా విభాగాలకు నిధులు కేటాయించండి

-మొదటిపేజీ తరువాయి

గుర్తు చేశారు. ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కూడా ఇదే విధమైన క్యాంపులను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలుగా గతంలో ఉండి తొలగించిన మూడు జిల్లాలను ఎస్ఆర్ఈ కింద (భద్రతాపరమైన వ్యయం, చెల్లింపులు) తిరిగి కొనసాగించాలని కోరారు. సరిహద్దు రాష్ట్రాలతో విశాలమైన సరిహద్దు ఉండటంతో తెలంగాణ భద్రతపైన మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.
తెలంగాణ రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని అణిచి వేసేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి గ్రామం, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామ పరిధిలో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రె గుట్టల కొండల్లో ఉన్న అనుకూలతను ఆసరాగా చేసుకొని సీపీఐ మావోయిస్టు కమిటీ ఒక ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసి తమ ప్రాబ్యల విస్తరణకు ప్రయత్నిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మావోయిస్టు ప్రత్యేక దళం కదలికల నియంత్రణతో పాటు నిర్మూలనకు జేటీఎఫ్ క్యాంపులు ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేళ్ల నుంచి పెండింగ్ లో ఉందని, ఆ మొత్తం రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కోరారు. మావోయిస్టుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఎస్పీవోల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులను మాత్రమే చేర్చుకోవాలనే నిబంధన సమాచారం చేరవేతకు ఇబ్బందిగా ఉందన్నారు. 1065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులు అందుబాటులో లేరని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ 9లోని (చట్టంలోని 53, 68, 71 సెక్షన్ల ప్రకారం) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ పదిలోని సంస్థల వివాదం (చట్టంలోని 75 సెక్షన్ ప్రకారం) సామరస్యపూర్వకంగా పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా ప్రస్తావించని ఆస్తులు,సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకుంటున్నందున, అందులో తెలంగాణకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్



షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

**చంద్రబాబుతో సమావేశమవుతున్నట్లు అమిత్ షాతో చెప్పాను: రేవంత్ రెడ్డి**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ నెల 6న సమావేశమవుతున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు చెప్పానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ, అమిత్ షాతో భేటీ అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆరో తేదీన మంచి వాతావరణంలో ఇరువురు ముఖ్యమంత్రులం చర్చించుకుంటున్నామని అమిత్ షా దృష్టికి తీసుకువెళ్లామన్నారు.
'మీరు సమస్యలు పరిష్కరించుకుంటామంటే మా సహకారం ఉంటుంది' అని అమిత్ షా తమకు హామీ ఇచ్చారని సీఎం తెలిపారు. నీటి పంపకాలు సహా ఎన్నో అంశాలు ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్నాయన్నారు.
సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ముఖ్యమంత్రులు కూర్చొని చర్చించిన తర్వాత కదా సీఎంల స్థాయిలో పరిష్కారమవు తాయా? లేదా? అని తెలిసేది అన్నారు. ఇరువురు సీఎంలు కూర్చున్న తర్వాత కూడా ఏ విషయంలోనైనా భిన్నాభిప్రాయాలు ఉంటే కేంద్రం సహకరిస్తుందన్నారు. ఇంకా సమస్య ఉంటే చట్టం ఉందన్నారు.

**భద్రాచలం వద్ద 5 గ్రామాల్ని వెనక్కివ్వాలని మోదీని కోరాం: భట్టివిక్రమార్క**

భద్రాచలం వద్ద ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తెలంగాణలో తిరిగి కలపాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను వారు కలిశారు. తెలంగాణకు సంబంధించి పలు విజ్ఞప్తులు చేశారు. అనంతరం రేవంత్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టివిక్రమార్క... కేంద్రానికి చేసిన విజ్ఞప్తుల జాబితాను వెల్లడించారు. ఏపీలోని ఐదు గ్రామాలను వెనక్కి ఇవ్వాలని మోదీని కోరినట్లు చెప్పారు. ఏపీ, తెలంగాణల మధ్య ఉన్న సమస్యలను కూడా పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. మేం అడిగిన వాటిని రాతపూర్వకంగా ఇచ్చామని తెలిపారు. తాము చెప్పిన వాటిని వారు సావధానంగా విని... సానుకూలంగా స్పందించారని చెప్పారు. విభజన హామీలను, వివిధ అంశాలను సాధ్యమైనంత త్వరగా అమలు చేసే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కేంద్రం పెద్దలు సానుకూలంగా స్పందించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.
అమిత్ షాను కలిసినప్పుడు వారి శాఖకు సంబంధించి తెలంగాణకు నిధులు ఇవ్వాలని కోరామని భట్టివిక్రమార్క తెలిపారు. తెలంగాణను డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా చేసేందుకు యాంటీ నార్కోటిక్ బ్యూరోకు నిధులు కోరినట్లు చెప్పారు. సైబర్ సెక్యూరిటీ కోసం కేంద్రం సహకారం కోరినట్లు చెప్పారు. అవసరమైన మేర ఐపీఎస్‌లను కేటాయించాలని కోరామన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా పరిగణించి నిధులు కోరినట్లు చెప్పారు.

**చంద్రబాబుతో భేటీలో...**

ఎల్లుండి చంద్రబాబుతో భేటీ సమయంలో ఏం అడగాలో అది అడుగుతామని మల్లు భట్టివిక్రమార్క అన్నారు. చంద్రబాబుతో సమావేశపు అజెండాలో చాలా అంశాలను పొందుపరిచామన్నారు.

**కేంద్రాన్ని కోరినవి...**

గోదావరి పరీవాహక ప్రాంతంలోని కోల్ బ్లాక్స్‌ను ఎలాంటి వేలం లేకుండా సింగరేణికి కేటాయించాలి.
ఐటీఐఆర్ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు... దీనిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి.
విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఇవ్వాలి
సెమీ కండక్టర్ మిషన్ కోసం సహకరించాలి
రానున్న ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లకు నిధులు మంజురు, సహకారం
పెండింగ్‌లో ఉన్న గ్రాంట్స్ ఇవ్వాలి
జిల్లాకో నవోదయ పాఠశాల, కస్తూర్బా పాఠశాల
కుసుం స్కీంలో సోలార్ వంటి ప్రాజెక్టులను కోరిన సీఎం, ఉపముఖ్యమంత్రి
డిఫెన్స్ ల్యాండ్ ఇవ్వాలని విజ్ఞప్తి
విభజన చట్టంలో పొందుపర్చిన షెడ్యూల్ 9, 10లోని అంశాలను పరిష్కరించాలి. ఈ అంశాలపై కేంద్రం చొరవ తీసుకోవాలి. స్టేట్ హైవేలను నేషనల్ హైవేస్‌గా మార్చాలి.
బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ.

# తెలంగాణ ప్రజల నిర్ణయం.. దేశ రైతాంగాన్ని నిరుత్సాహపరిచింది

-మొదటిపేజీ తరువాయి

ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల నుంచి తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అన్నివర్గాలను కడుపులోపెట్టుకొని తెలంగాణను సకలం బాగుచేస్తున్న కేసీఆర్ పాలన పోతదనుకోలేదని, జరిగిన పొరపాటుకు తెలంగాణ సమాజం బాధపడుతున్నదని కార్యకర్తలు, అభిమానులు పేర్కొన్నారు. తిరిగి కేసీఆర్ ముఖమంత్రి కావాలని, జై సీఎం.. జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలతో తమ మద్దతు ప్రకటించారు.

**అధికారం పోయిందని బాధపడటం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదు: కేసీఆర్**

అధికారం కోల్పోయామని బాధపడటం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారం లేదా ప్రతిపక్ష పాత్ర శాశ్వతం కాదన్నారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయన ఫామ్ హౌస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మనకు ప్రజా తీర్పే శిరోధార్యమన్నారు. వారు ఏ పాత్రను అప్పగిస్తే దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియనే రాజకీయం అన్నారు. దానికి గెలుపోటములతో సంబంధం ఉండదని హితబోధ చేశారు. ప్రజల్లో కలిసి ఉంటూ వారి సమస్యలమీద నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన సాగునీరు, తాగునీరు, నిరంతర విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, సీఎంఆర్ఎఫ్ వంటి అనేక పథకాలను కూడా నేటి కాంగ్రెస్ కొనసాగించకపోవడంతో తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోతోందని అవేదన వ్యక్తం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధించడమే బీఆర్ఎస్ అంతిమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. గెలుపోటములకు అతీతంగా నిరంతర కృషి కొనసాగించడమే మన కర్తవ్యమన్నారు. అన్నివర్గాలను కడుపులో పెట్టుకొని తెలంగాణను బాగు చేస్తున్న మన పాలన పోతుందని ఎవరూ అనుకోలేదన్నారు. జరిగిన పొరపాటుకు తెలంగాణ సమాజం బాధపడుతోందన్నారు. ఎన్నికల ఫలితాలతో దేశ రైతాంగం బాధపడిందన్నారు. కేసీఆర్ పాలన లేకపోవడంతో తెలంగాణ రైతుల కంటే మహారాష్ట్రతో పాటు దేశ రైతాంగమే తీవ్రంగా నష్టపోయిందన్నారు.



**ఎన్నికల ఫలితాలతో మహారాష్ట్ర ప్రజలు ఆవేదన చెందారు..**

అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో దేశంలో రైతు రాజ్యం తెచ్చుకోవాలని బీఆర్ఎస్‌తో కలిసి అడుగులేస్తూ ముందుకు కదిలిన మహారాష్ట్ర తదితర రాష్ట్రాల ప్రజలు మొన్నటి తెలంగాణ ఎన్నికల ఫలితాలతో తీవ్ర ఆవేదన చెందారన్నారు. కేసీఆర్ పాలన లేకపోవడంతో తెలంగాణ రైతుల కంటే మహారాష్ట్రతోపాటు దేశ రైతాంగమే తీవ్రంగా నష్టపోయిందని ఇటీవల తనను కలిసిన మహారాష్ట్ర నేతలు అన్నారని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమితో రైతు రాజ్యాన్ని అందించగల దమ్మున్న కేసీఆర్ దార్శనిక నాయకత్వాన్ని దేశం కోల్పోయిందని వారు బాధపడ్డారని తెలిపారు. నల్ల చట్టాలను తెచ్చి తమ జీవితాలను, తాము నమ్ముకున్న వ్యవసాయ రంగాన్ని ఆగం చేయాలని చూసిన గత బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో దేశ రైతాంగం శాంతియుత పోరాటం చేసిన సంగతిని కేసీఆర్ గుర్తుచేశారు. రైతుల మీద లాఠీఛార్జీ, కాల్పులు జరిపి 700 మంది రైతుల మరణానికి నాటి బీజేపీ సర్కార్ కారణమైందన్నారు.

**అధైర్యపడొద్దని కార్యకర్తలకు భరోసా**

దేశ రైతాంగ బాధలను తీర్చేందుకు నడుం కట్టిన బీఆర్ఎస్ కిసాన్ సర్కార్ నినాదంతో మహారాష్ట్ర నుంచి ఒక లైన్ తీసుకొని ముందుకు సాగిందని కేసీఆర్ వివరించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర ప్రజల నుంచి అపూర్వస్పందన కానవచ్చిందన్నారు. తెలంగాణతో పాటు దేశ రైతాంగ ప్రగతికోసం బయలుదేరిన నేపథ్యంలో తెలంగాణ ప్రజల నిర్ణయం ఇతర రాష్ట్రాల రైతాంగాన్ని నిరుత్సాహపరిచిందని తెలిపారు. అయినా, ఏమాత్రం అధైర్యపడొద్దని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయమని స్పష్టం చేశారు. 'ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు. ప్రతిపక్ష పాత్రకూడా శాశ్వతం కాదు. మనకు ప్రజాతీర్పే శిరోధార్యం. వారు ఎలాంటి పాత్రను అప్పగిస్తే దాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి. అధికారం కోల్పోయామని బాధపడడం సరియైన రాజకీయ నాయకుని లక్షణం కాదు. ప్రజాసంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియనే రాజకీయం. దానికి గెలుపు ఓటములతో సంబంధం ఉండదు. ప్రజల్లో కలిసివుంటూ వారి సమస్యలమీద నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలి' అని కేసీఆర్ పునరుద్ఘటించారు.

**కార్యకర్తలకు కేసీఆర్ వినతి..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన సాగు, తాగునీరు, నిరంతర విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, సీఎంఆర్ఎఫ్ తదితర అనేక పథకాలను కూడా నేటి కాంగ్రెస్ కొనసాగించకపోవడంతో తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోతున్నదని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధించడమే బీఆర్ఎస్ అంతిమలక్ష్యమని కేసీఆర్ స్పష్టం చేశారు. గెలుపోటములకు అతీతంగా నిరంతర కృషి కొనసాగించడమే మన కర్తవ్యమని కార్యకర్తలకు అధినేత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులకు కేసీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. సమాచారం లేకుండా వచ్చి ఇబ్బందిపడొద్దని సూచించారు. తనను కలిసేందుకు ముందస్తు సమాచారం లేకుండా రావడంతో మీకూ నాకూ ఇబ్బందేనన్నారు. వచ్చేముందు సమాచారం లేదంటే అనుమతి తీసుకొని రావాలని కేసీఆర్ మరోసారి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గాల పేర్లను పార్టీ ముందస్తుగా ప్రకటిస్తుందని.. ఆ ప్రకారం స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసుకుంటూ తనను కలవడానికి రావాలని కోరారు.

## కేశవరావు రాజ్యసభకు రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నాం: కేటీఆర్

**కాంగ్రెస్‌లో చేరిన కేకే... రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన వైనం**
**కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల రాజీనామా మాటేమిటని కేటీఆర్ ప్రశ్న**
**రాజ్యాంగాన్ని మీరు ఎలా నిలబెట్టాలనుకుంటున్నారని ప్రశ్న**

తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కె.కేశవరావు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అయితే బీఆర్ఎస్ టిక్కెట్‌పై పోటీ చేసి కాంగ్రెస్‌లో చేరిన పలువురు ఎమ్మెల్యేల సంగతి ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టిక్కెట్‌పై గెలిచిన దాదాపు అరడజను మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారన్నారు. కేకే రాజీనామా చేయడం స్వాగతించదగ్గదేనని... మరి ఎమ్మెల్యేల సంగతి ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని నిలబెడదామని రాహుల్ గాంధీ చెబుతున్నారని... కానీ ఇలా రాజ్యాంగాన్ని నిలబెడతారా? అని నిలదీశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఫిరాయింపులకు అవకాశం లేకుండా పదో షెడ్యూల్‌ను సవరిస్తామని కాంగ్రెస్, రాహుల్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మరి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా మీరు దేశానికి ఏం సందేశం ఇస్తున్నట్లు? ఈ దేశం మిమ్మల్ని ఎలా విశ్వసిస్తుంది? అని ప్రశ్నించారు. మీరు చెప్పినట్లుగా ఇది 'న్యాయ పత్రం' ఎలా అవుతుందో చెప్పాలన్నారు.

## ప్రభుత్వ తీరు దుర్మార్గం

-మొదటిపేజీ తరువాయి

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ రెండు ఘటనలు మరువక ముందే నేడు ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండలం ఆలియా తండాలో మరో రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు వదిలేందుకు సిద్ధమయ్యారు. రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించకపోవడం బాధాకరం. ఈ ప్రభుత్వానికి పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ, పట్టెడన్నం పెట్టే రైతుల సంక్షేమం పట్ల లేదు. పురుగుల మందే రైతన్నలకు పెరుగన్నం అయ్యే దుర్భర పరిస్థితులను ఏడు నెలల కాంగ్రెస్ పాలన మళ్లీ తీసుకువచ్చింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని, రైతుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కన్ఫ్యూజన్‌లో కాంగ్రెస్..

-మొదటిపేజీ తరువాయి

ఈలోపు ఏకాభిప్రాయం కోసం ప్రయత్నించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.

**అంతర్గత విబేధాలు..**

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు సద్దుమణిగేట్లు కనిపించడం లేదు. అధికారంలో ఉన్న హస్తం పార్టీ నేతలు ఐక్యంగా ఉన్నట్లు పైకి కనిపిస్తున్నా.. లోలోపల మాత్రం నేతల మధ్య విబేధాలు కొనసాగుతున్నాయనే చర్చ జరుగుతోంది. నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మంత్రివర్గం విస్తరణ వాయిదాపడింది. రెడ్డి సామాజికవర్గం నుంచి ఇద్దరిని, వెలమ సామాజిక వర్గం నుంచి ఒకరిని, బీసీ-ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి మంత్రివర్గంలోకి తీసుకోవాలని హైకమాండ్ నిర్ణయించింది. కానీ కొంతమంది సీనియర్లు అభ్యంతరం చెప్పడంతో మంత్రివర్గ విస్తరణను వాయిదా వేయాల్సి వచ్చింది. మరోవైపు పీసీసీ చీఫ్‌గా బీసీ సామాజికవర్గానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్‌ను ఎంపిక చేస్తారని ప్రచారం సాగింది. కానీ చివరి నిమిషంలో మహేష్ కుమార్ గౌడ్ నియమకాన్ని సీనియర్ మంత్రులు వ్యతిరేకిచారు. దీంతో చేసేదేమిలేక పీసీసీ చీఫ్‌తో పాటు మంత్రివర్గ విస్తరణను కాంగ్రెస్ హైకమాండ్ వాయిదావేసిందనే ప్రచారం సాగుతోంది.

**మంత్రివర్గం విస్తరణపై..**

రేవంత్ మంత్రివర్గంలో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇప్పటివరకు కేబినెట్‌లో చోటు దక్కని జిల్లాలకు అవకాశం కల్పించే ఉద్దేశంతో నలుగురు పేర్లను సీఎం రేవంత్ అధిష్టానానికి ప్రతిపాదించారు. ఇదే సమయంలో పార్టీలో సీనియర్ నేతలుగా ఉన్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మల్లు భట్టివిక్రమార్కతో చర్చించగా.. వాళ్లు ఇతర పేర్లను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీంతో సమగ్ర అధ్యయనం, సంప్రదింపుల తర్వాత మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని అధిష్టానం నిర్ణయించిందట. తొలుత పార్టీలో అంతర్గత విబేధాలు, బేధాభిప్రాయాలను పరిష్కరించిన తర్వాత పీసీసీ చీఫ్ ఎంపిక చేపట్టాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

## మూతబడిన పాఠశాలలపై దృష్టి

-మొదటిపేజీ తరువాయి

విద్యావ్యవస్థను గాడిలో పెట్టామని గోడలకు రంగులు వేసి కరపత్రాలు ముద్రించుకుని మురిపోయారు నాటి బీఆర్ఎస్ నేతలు. తెలంగాణలో 28 వేల పైచిలుకు పాఠశాలలు ఉండగా అందులో ఇప్పటికీ సగానికిపైగా పాఠశాలలు మూసి వేయబడ్డాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కార్ తక్షణ చర్యలు తీసుకోకపోతే కొత్తగా మరికొన్ని మూతబడే ప్రమాదం ఉంది. మూతబడిన ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ తిరిగి తెరిపించాలని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలను విద్యాశాఖ అధికారులు బేఖాతరు చేస్తున్నారు.విద్యార్థులు లేక మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ నీటి మూటగానే మిగిలింది. తాజాగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న వాటికి కేటాయించనేలేదు. విద్యార్థులున్న పాఠశాలలకే ఉపాధ్యాయులను కేటాయిస్తూ వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పది మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలకు ఒకరు, 11 నుంచి 40 మంది వరకు ఉన్న పాఠశాలలకు ఇద్దరు, 41 నుంచి 60 మంది ఉన్న పాఠశాలలకు ముగ్గురు, 61, ఆపైన విద్యార్థులున్న పాఠశాలలకు మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేసేలా వెబ్ ఆప్షన్లను కేటాయించింది. తాజా ప్రకటనతో ముఖ్యమంత్రి హామీ ఇప్పట్లో అమలయ్యేలా లేదని తేలింది.రాష్ట్రంలో మూతపడిన ప్రభుత్వ బడులను తెరిపిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ బడులను తెరిపించేందుకు ఉపాధ్యాయులను కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో విద్యార్థులు లేక (జీరో ఎన్‌రోల్‌మెంట్) మూతపడిన 1,739 ప్రభుత్వ పాఠశాలలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెరుచుకుంటాయని ప్రజలు ఆశించారు. కానీ, ఆ పాఠశాలలకు తాజాగా ఒక్క ఉపాధ్యాయుడినీ ప్రభుత్వం కేటాయించలేదు.రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండలంలో ఖాజాగూడ, మంచర్లగూడ పాఠశాలలు మూతబడి దశాబ్ద కాలం గడుస్తున్నది. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు చేసేదేమీ లేక తమ పిల్లలను అప్పో సప్పో చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూతబడిన అన్ని పాఠశాలలను తిరిగి తెరిపించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా.. ఇప్పటికే శంకర్పల్లి మండలంలో మూతబడిన లక్ష్మారెడ్డి గూడ ప్రాథమిక పాఠశాల, లచ్చిరెడ్డి గూడ, కచ్చిరెడ్డి గూడ గ్రామాల్లో విద్యాశాఖ అధికారులు పాఠశాలలను తెరిపించారు. కాగా, పాఠశాలలు తెరిచి 15 రోజులు గడుస్తున్నా మండలంలో ఇంకా ఖాజాగూడ, మంచర్లగూడ పాఠశాలలు తెరుచుకోలేదు. ఖాజా గూడ గ్రామస్తులు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల తెరుచుకోకపోవడంతో తమ పిల్లలను సమీపంలోని ఎలవర్తి గ్రామానికి పంపించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో మూతబడిన పాఠశాలలను తెరిపిస్తుండగా, తమ గ్రామంలో ఎందుకు తెరిపించడం లేదని ఖాజాగూడ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మూతబడిన ఖాజాగూడ, మంచర్లగూడ పాఠశాలలు తెరిపించే విషయమై సంప్రదించేందుకు శంకర్పల్లి ఇన్చార్జి ఎంఈవో సయ్యద్ అక్బర్‌కు ఫోన్ చేస్తే.. ఆయన స్పందించకపోవడం గమనార్హం.

# చట్టాలతో పాటు పోలీసుల తీరు మారితేనే సత్ఫలితాలు

ఐపీసీ, సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను రూపొందించింది. వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం ను జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి తీసుకువచ్చింది. వీటిలో వివిధ సెక్షన్లనూ, శిక్షలనూ మార్చారు. వీటి ద్వారా సత్ఫలితాలు అందాలంటే ముందుగా పోలీసుల పనితీరు మారాల్సిన అవసరమున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ కొత్త చట్టాలు పోలీసులకు కాస్త 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చాయనే అభిప్రాయం ఉండగా.. వీటిని సద్వినియోగం చేసుకొని నేర నియంత్రణతోపాటు శాంతి భద్రతలను పరిరక్షిం చవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందనే చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా పోలీసులే నిందితులుగా మారుతుండడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరమున్నది.



### పెరిగిన నేరాలు..

గత ఆరు నెలలుగా రాష్ట్రంలో నేరాలు పెరిగాయని గణాంకాల ద్వారా స్పష్టమవుతున్నది. ఒక్క జూన్ నెలలోనే 26 హత్యలు జరగడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. వీటికి తోడు హైదరాబాద్‌లో థార్, చుడీదార్, భవారియా గ్యాంగులు యథేచ్ఛగా దోపిడీలు, దొంగతనాలు, చైన్ స్నాచింగులు చేస్తున్నా వాటిని నిలువరించడంలో పోలీసు వ్యవస్థ విఫలమైందనే చర్చ జరుగుతున్నది. ఇంకా సైబర్ నేరాలు సైతం ఆందోళన కలిగిస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు రూ. కోట్లలోనే సొమ్మును దోచుకుంటున్నారు. వీటికితోడు వైట్‌కాలర్ మోసాలు, రియల్ ఎస్టేట్, చీటీల మోసాలు సాధారణం అయిపోయాయి.

### పోలీసులపైనే కేసులతో ఆందోళన..

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులపైనే కేసులు నమోదవుతుండడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఈ ఏడాది ఏసీబీ అధికారులు దాదాపు 20 మంది పోలీసులపై కేసులు నమోదు చేశారు. లంచాలు తీసుకుంటూ పలువురిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఖాకీలు మహిళలపై లైంగిక దాడి చేసిన ఘటనలు సైతం వెలుగుచూశాయి. వివిధ కారణాలతో 30 మందికి పైగా సీఐలు, ఎస్ఐలు సస్పెండ్ అయ్యారు. పలువురిని అటాచ్ చేశారు. దీనికి రెట్టింపుగా రాష్ట్రవ్యాప్తంగా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. అంతేకాకుండా పోలీసు వ్యవస్థలో కీలకమైన హాక్ ఐ, టీఎస్ కాప్, ఎస్ఎంఎస్ వ్యవస్థలను హ్యాకర్లు హ్యాక్ చేయడం సంచలనం సృష్టించింది. సివిల్ వివాదాలు, సెటిల్మెంట్లలో సైతం పోలీసులు తలదూర్చడం ఆందోళన కలిగిస్తున్నది.

### సమాజహితంగా ఆలోచిస్తేనే ప్రయోజనం..

కొత్త చట్టాల్లో పోలీసులకు కొన్ని ఎక్కువ అధికారాలను ఇచ్చారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ఏకంగా 14 రోజుల పాటు పోలీసు అధికారి ప్రాథమిక దర్యాప్తు చేయవచ్చు. ఇంకా వివిధ రకాల పవర్స్ వారికి ఇచ్చారు. దీనిపై అనేక విమర్శలు వస్తున్నాయి. అయితే దీనిపై డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పోలీసులు సమాజహితం కోసం ఇలాంటి అధికారాలను ఉపయోగిస్తే ఎంతో మేలు జరిగే అవకాశముంటుంది. దీనికి తోడు కొన్ని చట్టాల్లో మార్పులు చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అప్పగించింది. ఈ చట్టాలను సమీక్షించి ప్రజలకు మంచి జరిగేలా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దీనికంటే ముందు రాష్ట్రానికి హోం మినిస్టర్ ను నియమించాలనే అభిప్రాయం కూడా ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరమేర్పడింది. పోలీసు శాఖపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్షాళన చేయాలనే డిమాండ్ కూడా ఉన్నది. వివిధ రకాల ఆరోపణలు ఉన్న పోలీసులను తప్పించి.. వారి స్థానంలో సత్ప్రవర్తన కలిగిన అధికారులను నియమించాల్సిన అవసరమున్నది. పోలీసు శాఖలో రాజకీయ జోక్యాన్ని నివారించి, చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేసి శాంతిభద్రతలను పరిరక్షించగలిగితేనే రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనించే అవకాశమున్నది.

శ్రీకాంత్ పారే,
ఇండిపెండెంట్ జర్నలిస్ట్, 9492135105

## జిల్లా పరిషత్'లో జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్‌కి ఆత్మీయ వీడ్కోలు సన్మానం





వాస్తవ నేస్తం,పటాన్చెరు: సంగారెడ్డి జిల్లా జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభలో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజా నరసింహ, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ ని ఘనంగా శాలువాతో సన్మానించి షీల్డ్ బహుకరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నను ఎంపీపీ గా చేసిన ఎంపీటీసీలు జిన్నారం మండల గ్రామ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాని అన్నారు. ఎంపీపీ పదవిలో కొనసాగినన్ని రోజులు జిన్నారం మండల ప్రజల కొరకు మండల అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడ్డానని నేను ఎంపీపీ గా 4 సం ల 6నెలలు ప్రతిపక్ష పార్టీలో ఉన్న పార్టీలకతీతంగా జిన్నారం మండల అభివృద్ధి కోసం కృషి చేశానని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు మరింత చేరువగా సంక్షేమ పథకాలు ప్రజలకు తీసుకెళ్లి ప్రజలకు లబ్ధి చేకూర్చేలా చేస్తామని అన్నారు. ఎంపీపీ పదవిలో ఉన్నన్ని రోజులు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకొని ప్రజా సంక్షేమ పథకాల కోసమే పాటుపడ్డామని వ్యక్తిగత దూషణలకు వ్యక్తిగత పగ ప్రతికారాలకు ఎక్కడ తావునీయకుండా చూసుకున్నానని తెలిపారు. ఎంపీపీ పదవి కాలంలో ఉన్నన్ని రోజులు జిన్నారం మండలంలోని అధికారులు తనకు సహకారాలు అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐదు సంవత్సరాలు ఎంపీపీగా కొనసాగించినందుకు ఎంపిటిసి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ పదవిలో ఐదు సంవత్సరాల పదవి కాలం లో అనేక ఆటుపోట్లు ఎదురుపడిన ఎక్కడ తగ్గకుండా ప్రజల శ్రేయస్సు కోసం జిన్నారం మండల అభివృద్ధి కోసం ముందుకు వెళ్లి మండలాన్ని మరింత అభివృద్ధి చేశానని అన్నారు.

## కార్డియాక్ స్క్రీనింగ్ క్యాంపును కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి.

**ఆర్.జి-3 ఏరియా జీ.ఎం. ఎన్.సుధాకర రావు**

**కమాన్‌పూర్ :** సింగరేణి ఆర్.జి-3 ఏరియాలోని ఓ.సి-1 ఉపరితల గని ఒప్పంద ఉద్యోగులకు గుండె పని తీరు మరియు సంబంధిత వ్యాధుల నిర్ధారణకు రామగుండం రీజినల్ సింగరేణి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "కార్డియాక్ స్క్రీనింగ్ క్యాంపు" ను గురువారం ఆర్.జి-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేసే ఒప్పంద కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించేందుకు యాజమాన్యం తాజాగా నిర్ణయం తీసుకొందని, దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యం లో ముందస్తు జాగ్రత్తగా కార్మికులకు వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేసిందనీ, ఆరోగ్య సంరక్షణపై అవగాహణ కల్పించే దిశగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందనీ, ఇందులో భాగంగా గురువారం నుండి అన్ని గనులలో ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని, వయసుతో సంబంధం లేకుండా చాలా మంది గుండెపోటుతో మరణిస్తున్నారని, మారుతున్న జీవన శైలి, ఆహార అలవాట్లు దీనికి ప్రధాన కారణమని ఆయన అన్నారు. ఇటువంటి స్క్రీనింగ్ క్యాంపుల ద్వారా పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏవైనా గుండె సంబంధిత సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించి ప్రాణహాని నుండి బయట పడవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని అందరు ఒప్పంద ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని, ఈ స్కీనింగ్ క్యాంప్ 4 రోజుల పాటు కొనసాగుతుందని వారు అన్నారు.

## దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం

**కరీంనగర్ :** తెలంగాణ స్వయం పాలన ఆకాంక్షలకు ఊపురిలూదిన సాయుధ కాలపు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గురువారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆ మహా యోధుడి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలుగా గుర్తుండిపోతుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామంలో ఒక సాధారణ కురుమ కులానికి చెందిన కుటుంబంలో జన్మించిన కొమురయ్య ఒక మహోన్నత ఉద్యమానికి ఆద్యుడు అవడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



వాస్తవ నేస్తం,కోటగిరి: మండల కేంద్రంలో మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇటీవల జరిగిన సమావేశాల్లో రాహుల్ గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు వేముల నవీన్ తెలిపారు. రాహుల్ గాంధీ వెంటనే హిందువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేదంటే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు మామిడి శ్రీనివాస్ కమ్మరి వేణు మామిడి రవి ఆకుల నరేష్ చాకలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** మంచిర్యాలలోని డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి ఎస్.ఎస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు గెలుచుకున్నారని కోచ్ సల్పల సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం తిలక్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను వాకర్ సభ్యులు అభినందించారు. అండర్ 8 విభాగంలో అరుసం చిన్మయి చైత్రిక, ఇందూరి చాణక్య, అండర్ 10 విభాగంలో ఇందూరి అనన్య, ఎస్. కె సానియా, అండర్ 12 విభాగంలో బి. ఆరాధన, ఎం. డి. తమన్నా, ఎస్. కె సోఫియా భాను విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 7వ తేదీన హైదరాబాద్ గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్ సభ్యులు కె. నగేష్, శ్రీనివాస్, పురుషోత్తం, కుమ్మరి శ్రీకాంత్, అరుసం శ్రావణ్, మల్లేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి ఎంపీపీకి శుభాకాంక్షలు తెలిపిన పీటర్ నాయక్



**వాస్తవ నేస్తం,కూసుమంచి:** ఎంపీపీ బానోతు శ్రీనివాస్ నాయక్ దంపతులకు, నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సీనియర్ నేషనల్ ప్రెసిడెంట్, సామాజికవేత, వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అతిచిన్న వయసులో రాజకీయ రంగా ప్రవేశం చేసిన బానోతు శ్రీనివాస్ నాయక్ రానున్న రోజుల్లో ఇంకా బలమైన రాజకీయ నాయకుడుగా ఎదగాలని, అంచెలు అంచేలుగా ఉన్నత శిఖరాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.

## కోలాట బృందానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసిన పీటర్ నాయక్



**వాస్తవ నేస్తం,కూసుమంచి:** మండలంలోని మండలం గొర్రెలపాడు తండా గ్రామపంచాయితీ శివారునగల చాంప్లా తండాకు చెందిన హరేశ్రీనివాస్ కోలాట బృందానికి పీటర్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వ్యవస్థాపకులు డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక కోలాట బృందం మహిళలు మాట్లాడుతూ.. ఎప్పుడు ఏ సాంస్కృతిక కార్యక్రమానికి సహాయం అడిగిన కాదనకుండా తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వచ్చిన డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలి




**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల యువమోర్చా అధ్యక్షుడు ఎల్లన్న గారి ఎల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దారుకి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి, అలాగే పేద విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలి అలాగే డీఎస్సీ వెంటనే అమలుపరిచి ఉద్యోగాలు ఇవ్వాలి మరియు రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి ఇంకా చేతకాని హామీలు ప్రవేశపెట్టి యువతను విద్యార్థులను మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఖబర్దార్ మీకు ఓట్లు వేసింది విద్యార్థులు నిరుద్యోగులు కాబట్టి వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చాలి లేని పక్షంలో రాస్తారోకోలు ధర్నాలు చేస్తామని జిన్నారం మండల యువమోర్చా తరఫున హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి, సీనియర్ నాయకులు కురుపల్లి నర్సింగరావు, మండల అధ్యక్షులు కొత్త కపు జగన్ రెడ్డి,దోమడుగు రమేష్, పూదూరు సుధాకర్, షాడో రామ్, ప్రవీణ్,బిక్షపతి, జిన్నారం మండల బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

**హైదరాబాద్ :** అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్న తెలంగాణలో పాలన గాడిన పడలేదు. పాలన గాలికి వదిలేసి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు కాంగ్రెస్ ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి మంత్రులుని ఎమ్మెల్సీ తాత మధు విమర్శించారు. గురువారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. తాత మధు మాట్లాడుతూ ఇన్ని రోజులు అయిన రైతులకు అందించాల్సిన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడం లేదు. వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కేసీఆర్ పాలనలో జూన్ మాసంలోనే రైతు బంధు ఇచ్చేవాళ్ళు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com